"నేనిలా అంటున్నానని మరోలా అనుకోకు సదానందం! నీ మేలు కోరి చెప్తున్నాను. నీ ఆదర్శాలు, ఆశయాలు, నీతి నియమాలు కాస్సేపు పక్కన పెట్టి నిదానంగా ఆలోచించు. జీవితంలో ఎదగడానికి కాస్త తెగింపు అవసరం. అన్నిటికీ భయపడి కూర్చుంటే ఏ పనీ జరగదు. పరిస్థితులు మనల్ని వెదుక్కు నిరావు. మనమే వాటిని గమనించి అదను చూసి అనుకూలంగా మలచుకో వాలి. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోమన్నారు. నాలుగు డబ్బులు వెనకే సుకో. లేకుంటే ఎన్నాళ్లయినా జీవితంలో ఎదుగూబొదుగూ ఉండదు. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే మురారి నీ ఒక్కగానొక్క కొడుకు. వాడీ సంవత్సరం టెన్త్‌క్లాస్ పరీక్ష రాసాడు. వాడు చదివిందేమో గవర్నమెంట్ హైస్కూల్లో. అక్కడ చదువులూ, వాటి స్టాండర్డ్ అందరికీ తెలిసినదే. పైచదువుల కోసం వాడిని కాలేజీలో చేర్పించాలంటే సీటుకోసం లక్షలు గుమ్మరించాలి. ఈ పరిస్థితిలో నీకది సాధ్యమా?

మనిద్దరం ఒకేరోజు ఉద్యోగాల్లో చేరాము. నీదేమో కాసులు కురిపించే జాబు. అయినా ఏం లాభం? ఇన్నేళ్లు సర్వీసు చేసి కనీసం సైకిల్ కూడా కొనలేక ఆఫీసుకు నడిచి వెళ్లి వస్తున్నావు. నా జాబు అంత ప్రధానమైనదికాదు. అయితే నేను చేతులు ముడుచుకుని కూర్చోలేదు. పరిస్థితుల్ని నాకు అనుకూలంగా మలచుకున్నాను. నీతి నిజాయితీవల్ల లాభం ఏమిటి? ఆఫీసరు మెప్పు తప్ప? సదానందంగారూ! మీ స్నేహితుడేకదా. వారితో చెప్పి మా పని అయ్యేలా చూడండి. అడిగినంత వారికి ఇస్తాం అంటూ రోజూ చాలామంది నావద్దకు వచ్చి నన్ను ఇబ్బంది పెడుతున్నారు. ఒకవిధంగా నీవల్ల నేనూ లాభ పడవచ్చు. వర్షం వచ్చేలావుంది. పద నా కార్లో నిన్ను మీ ఇంటివద్ద దింపుతాను"

"విలాసరావుగారూ..."

"అదే..అదేనోయ్...అలా గౌరవ సంబోధనతోను, నీ వినయ విధేయలతోనూ ఎదుటివారిని పడగొట్టేస్తావు?"

"మీరు ఎన్నోసార్లు నాతో ఈ విషయం ప్రస్తావించారు. మీ అభిమానానికి కృతజ్ఞుడిని. అయితే ఏది ఏమైనా నేను నా ఆశయాలను, ఆదర్శాలను వదులుకోలేను. నా నిర్ణయం మారదు. ఇక మా ఇల్లు ఈ చిన్న సందులోనే వుంది. మీ కారు పోదు. అదీగాక మన దారులు వేరు. మీరు బయల్దేరండి."

★★★

"ఏమిటోయ్ సదానందం! ఈమధ్య కనిపించడంలేదు. కుశలమేనా? అన్నట్లు మీవాడు టెన్త్ స్టేట్ ఫస్ట్ వచ్చాడని విని చాలా సంతోషించాను. మంచి చురుకైనవాడు.తెలివైనవాడు కదా మరి అటువంటివాడిని ఏ కాలేజీలోనో చేర్పించక పరమేశ్వరీ మోటార్ ఇంజనీరింగ్ వర్క్‌షాపులో చేర్పించావుట. వాడు సంపాదించి తెచ్చే రోజు కూలీకి ఆశపడి వాడి భవిష్యత్తు పాడు చేసావు కదా. కన్నకొడుకును చదివించలేని స్థితికి వచ్చావు. మావాడు అత్తెసరు మార్కులతో గట్టెక్కినా రెండులక్షల డొనేషన్ కట్టి హైదరాబాద్‌లో కార్పొరేట్ కాలేజీలో జాయిన్ చేసి హాస్టల్‌లో వుంచి చదివిస్తున్నా. ఇప్పుడు వాడు ఎంతో సంతోషంగా ఉన్నాడు. వాడు కోరుకున్న విధంగా వాడిని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని చేస్తాను."

"చాలా సంతోషం విలాసరావుగారూ. మీ అబ్బాయి కోరుకున్న విద్యను వాడికి అందిస్తున్నారు. ఇక మావాడి విషయం అంటారా... నేను వాడిని బలవంతం చేయలేదు. వాడే తానుగా నిర్ణయం తీసుకుని పనిలో చేరిన తరువాతే నాతో చెప్పాడు. వాడి ఆలోచనలు, ఆశయాలు, ఆదర్శాలు నాకూ నచ్చాయి. అందువల్ల కాదనలేకపోయాను."

"బాగుందోయ్ నీ సమర్థింపు. చిన్నవాడు వాడికేం తెలుసు మంచి చెడ్డలు. ఎర్రగా నవనవలాడుతున్న మిరపపండు చూసి పిల్లాడు తింటానని మారాం చేస్తే తినమని ఇస్తామా?"

"మావాడు ఎప్పుడూ తప్పుడు నిర్ణయాలు తీసుకోడు. వాడిపైన నాకు గట్టి నమ్మకముంది"


★★★

"ఏడాది తిరక్కుండానే మీ అబ్బాయి గొప్ప ప్రయోజకుడు అయ్యాడోయ్. ఆటో మెకానిజంలో మంచి నైపుణ్యం సంపాదించాడు. జీనియస్... అన్నట్లు నీకు ప్రమోషన్ వచ్చిందని విన్నాను. చెప్పలేదేం. చాలా సంతోషం. మీవాడు పట్టుబట్టి నీచేత స్కూటర్ కొనిపించాడట బాగుందోయ్. నా కారేమో ఈమధ్య ఐరావతమై కూర్చుంది. తరచూ రిపేర్లు భరించలేక వచ్చినకాడికి అమ్మేసి ఈ మోపెడ్ కొన్నాను."

★★★

"నమస్కారం విలాసరావుగారూ! ఏమిటిలా ఎండలో కాళ్లీడ్చుకుంటూ ఎక్కడికి వెళ్తున్నారు. ఆ వాలకం ఏంటి? ఏమైంది? ఎప్పుడూ నీట్‌గా నలగని దుస్తులతో టిప్‌టాప్‌గా ఉంటూ చిరునవ్వులు చిందించేవారు. రండి కార్లో వెళ్తూ మాట్లాడుకుందాం. బయట ఎండ ఎక్కువగా ఉంది."

"నువ్వా సదానందం! నీ కోసమే, నిన్ను కలవాలనే బయల్దేరాను. మనం కలుసుకుని చాలాకాలమైంది కదూ. మావాడి కార్పొరేట్ కాలేజీ చదువు నా



# గమ్యం

-రావి-ఎన్-అవధాని

కొంపముంచింది. వాడేమో బుద్ధిగా చదువుకుంటున్నాడని నెలనెలా వేలు పంపిస్తుంటే వాడేమో జల్సాచేస్తూ సకల వ్యసనాలూ అలవాటు చేసుకున్నాడు. నాకీ విషయం తెలిసేసరికి పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోయింది. అక్కడుంచితే మనిషి కూడా మనకు దక్కడని వెంటబెట్టుకుని వచ్చాను.ఇక నా విషయం అంటావా? నాలుగేళ్లక్రితం నన్ను వైజాగ్ బదిలీ చేసారు. అక్కడ ఆఫీసులో కిట్టనివాళ్లెవరో రిపోర్టు చేసారు. సస్పెన్షన్, కోర్టు కేసులు, విచారణ షరా మామూలే. ఎన్నేళ్లయినా తేల్చరు. అదిసరే ఆనాడు మీ అబ్బాయి ముందు చూపుతో మంచి నిర్ణయం తీసుకున్నాడోయ్. జాబ్ చేస్తూ ప్రైవేట్‌గా చదివి డిగ్రీ పుచ్చుకుని ఎమ్‌బిఏ కూడా పూర్తి చేసాడని విన్నాను. చాలా సంతోషం. మారుతీకార్ల సేల్స్ అండ్ సర్వీస్ డీలర్‌షిప్ ఏజెన్సీ సంపాదించి గొప్ప వ్యాపారవేత్త అయినందుకు నా అభినందనలు. నిన్నో సహాయం చేయమని అడగడానికి వచ్చాను. ప్రస్తుతం నా ఆర్థిక పరిస్థితి బాగాలేదు. రోజు గడవడం కష్టంగా ఉంది. మీ అబ్బాయికి చెప్పి మావాడికి ఏదైనా చిన్న జాబ్ ఇప్పించి పుణ్యం కట్టుకో. అదిగో నీ గమ్యం చేరువైంది. కారు ఆపితే నేను దిగి వెళ్లిపోతాను. నేను చెప్పిన విషయం గుర్తుంచుకుంటావుగా!

★